www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 14 అక్టోబర్ 2024

60 బస్సులపై కేసుల నమోదు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రెండు రోజులుగా కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని, ఈ రెండు రోజుల్లో మొత్తం 60 బస్సులపై కేసులు నమోదు చేశామని ఏలూరు జిల్లా ఉపరవాణా కమిషనర్ షేక్ కరీం తెలిపారు. ప్రయాణికులను రవాణా చేస్తున్న కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులను తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ బస్సుల్లో సరుకు రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ప్రయాణికుల వద్ద నుండి ఎక్కువ మొత్తంలో రవాణా ఛార్జీ వసూలు చేస్తున్నట్లు కూడా గుర్తించారు. కొన్ని బస్సులు పర్మిట్ వైలేషన్ చేస్తున్నట్లు గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల్లో మొత్తంగా 60 కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులపై రవాణా శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డిటిసి షేక్ కరీం మాట్లాడుతూ ప్రత్యేక డ్రైవ్‌లను కొనసాగిస్తూనే ఉంటామని ఆయన తెలిపారు. ప్రస్తుతం దసరా ఉత్సవాలు ముగుస్తున్న నేపథ్యంలో మరో రెండు రోజులపాటు ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో పని చేస్తున్న ఎంవిఐలు, ఎఎంవిఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతుకు..
భరోసా ఇస్తారా..

- సీడ్స్ కంపెనీల నిరంకుశ ధోరణికి అడ్డుకట్ట పడేనా
- రైతులకు అగ్రిమెంట్లు రాయకుండా ప్రతియేటా సీడ్స్ అందజేత
- పంట దెబ్బతింటే రైతులను పట్టించుకోని కంపెనీలు
- మొక్కజొన్న సీడ్స్ సాగుపై వ్యవసాయ శాఖ తీవ్ర నిర్లక్ష్యం
- జిల్లాలో లక్షా 25 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు
- 2019కు ముందు సీడ్స్ కంపెనీల తీరును నిరసిస్తూ జెడ్పి తీర్మానం
- విత్తన చట్టంలో లోపాలతో ఇష్టారాజ్యంగా సీడ్స్ కంపెనీలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో అతి పెద్దసాగుగా ఉన్న మొక్కజొన్న సాగులో రైతులకు భరోసా లేకుండాపోయింది. సీడ్స్ కంపెనీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. ప్రభుత్వం మారడంతో మొక్కజొన్న సాగుకు భరోసా కల్పించాలంటూ రైతులు కోరుతున్న పరిస్థితి నెలకొంది. ఏలూరు జిల్లాలోని మెట్ట ప్రాంతంలో అతి పెద్దసాగుగా మొక్కజొన్న ఉంది. జిల్లాలో లక్షా 25 వేల ఎకరాల్లో మొక్కజొన్న రైతులు సాగు చేస్తున్నారు. జిల్లా వ్యవసాయ సాగులో 27 శాతం మొక్కజొన్న ఉంది. ఇంత పెద్దమొత్తంలో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్నపై వ్యవసాయశాఖ పర్యవేక్షణ సరిగా లేకుండాపోయింది. మొక్కజొన్న సాగులో రెండు రకాల సాగు పద్ధతులు ఉంటాయి. కమర్షియల్ పద్ధతి ఒకటి, కంపెనీ సీడ్స్ తీసుకుని సాగుచేసే పద్ధతి మరొకటి. జిల్లాలోని మొక్కజొన్న సాగులో 60 శాతానికిపైగా కంపెనీలు అందించే సీడ్స్ ఆధారంగానే సాగు సాగుతోంది. రైతుల వద్దకు వెళ్లి కంపెనీలు తమ సీడ్స్ అందిస్తాయి. ఎకరాకు పెద్దమొత్తంలో దిగుబడి వస్తుందని నమ్మబలికి ఈ సీడ్స్ ఇస్తారు. పండిన పంటను కంపెనీలే కొనుగోలు చేస్తాయి. ముందుగా కొంతమేర పెట్టుబడి సైతం కంపెనీలు అందిస్తాయి. ఈ విధంగా కంపెనీలు అందించే సీడ్స్ సాగు చేసిన పొలాలు సరైన దిగుబడులు రాక దెబ్బతింటే నిబంధనల ప్రకారం కంపెనీలు ఆ నష్టాన్ని రైతులకు అందించి ఆదుకోవాలి. ఎక్కడా అలా జరగడం లేదు. ఎకరాకు ఏడు నుంచి ఎనిమిది టన్నుల దిగుబడి వస్తుందని కంపెనీలు తమ మొక్కజొన్న సీడ్స్‌ను రైతులకు అందిస్తున్నాయి. మూడు టన్నుల దిగుబడి రాని పరిస్థితి ఉంటుంది. దీంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. సీడ్స్ సాగులో ఎకరాకు రూ.50 వేలకుపైగా పెట్టుబడి ఖర్చవుతోంది. కౌలు ఎకరానికి రూ.30 వేలు వరకూ ఉంటుంది. అన్నీ కలిపి ఎకరాకు రూ.80 నుంచి రూ.90 వేలు వరకూ ఖర్చవుతోంది. కంపెనీ సీడ్స్ సాగు చేసిన పంటను టన్ను రూ.15 వేల నుంచి రూ.16 వేలు వరకూ కొనుగోలు చేస్తారు. మూడు, నాలుగు టన్నుల దిగుబడి వస్తే ఎకరాకు రూ.60 వేలు సొమ్ము రావడమే గగనంగా మారుతోంది. దీంతో రైతులు ఎకరాకు రూ.30 వేల వరకూ నష్టపోతున్నారు. కొయ్యలగూడెం, దెందులూరు, పెదవేగి ఇలా అనేక మండలాల్లో ప్రతియేటా మొక్కజొన్న సీడ్స్ సాగు చేసి రైతులు దెబ్బతింటున్నారు. నిబంధనల ప్రకారం కంపెనీలు తమ సీడ్స్‌ను రైతులకు అందించేటప్పుడు అగ్రిమెంట్లు రాయాలి. పంట దిగుబడి రాకపోతే కంపెనీ ఆదుకుంటుందని అందులో పొందుపరచాలి. ఎక్కడా ఆ విధంగా జరగడం లేదు. వ్యవసాయ శాఖాధికారులు కూడా కంపెనీలు రైతులకు అగ్రిమెంట్లు రాసేవిధంగా ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. సీడ్స్ సాగు ఎంత జరుగుతుందో కూడా సమాచారం వ్యవసాయశాఖ వద్ద ఉండటం లేదు. విత్తన చట్టంలో ఉన్న లోపాల కారణంగా ఈ పరిస్థితి నెలకొందని చెప్పొచ్చు. కమర్షియల్ సాగులో విత్తనాలను రైతులే కొనుగోలు చేసుకుని సాగు చేస్తారు. పండిన పంట క్వింటాకు రూ.2300కుపైగా ధర ఉంటుంది. మార్కెట్ ధర తక్కువగా ఉంటే మార్కెటింగ్ శాఖ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పంటను కొనుగోలు చేస్తోంది. సీడ్స్ సాగులో అటువంటి పరిస్థితి లేకుండా పోతుంది. దీంతో రైతులు ప్రతియేటా తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు.

భరోసా కల్పించి రైతులకు అండగా ఉంటారా?

మొక్కజొన్న సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. అక్టోబర్ 20వ తేదీ తర్వాత రైతులు సాగు ప్రారంభించనున్నారు. మొక్కజొన్న సీడ్స్ కంపెనీల ప్రతినిధులు ఇప్పటికే గ్రామాల్లో తిరగుతున్నారు. తమ కంపెనీల సీడ్స్‌ను రైతులకు అంటగట్టేందుకు ఏమారుస్తున్నారు. సీడ్స్ అందిస్తున్న కంపెనీలు రైతులకు అగ్రిమెంట్లు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటేనే అన్నదాతకు భరోసా ఉంటుంది. 2019కు ముందు గత టిడిపి ప్రభుత్వంలో మొక్కజొన్న సీడ్స్ సమస్యపై రైతులు పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. కంపెనీలు తమను మోసగిస్తున్నాయంటూ గగ్గోలు పెట్టారు. దీంతో అప్పుడు దెందులూరు ఎంఎల్‌ఎగా ఉన్న చింతమనేని ప్రభాకర్ జిల్లా పరిషత్ సమావేశంలో దీన్ని ప్రస్తావించారు. దీనిపై పెద్దఎత్తున చర్చ సాగింది. అప్పటి జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్ మాట్లాడుతూ విత్తన కంపెనీలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడతామని హామీ ఇచ్చారు. దీనిపై జిల్లా పరిషత్ సమావేశంలో తీర్మానం సైతం చేశారు. సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం మొక్కజొన్న రైతుల గురించి పట్టించుకున్న దాఖలాల్లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మరోసారి రైతుల్లో ఆశలు చిగురించాయి. మొక్కజొన్న సీడ్స్ కంపెనీలు నిబంధనలకు అనుగుణంగా నడుచుకునేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు అగ్రిమెంట్లు రాసిచ్చేలా వ్యవసాయ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అంతేకాకుండా సరైన విత్తన చట్టం తీసుకొచ్చి రైతులకు అండగా నిలబడాలని డిమాండ్ చేస్తున్నారు. కంపెనీల సీడ్స్ సాగు చేసే పొలాలకు సంబంధించి ఇ-క్రాప్ చేయడం లేదని రైతులు చెబుతున్నారు. దీంతో పంట నష్టపోయినా పరిహారం వంటివి రైతులకు అందని పరిస్థితి నెలకొంది. మొక్కజొన్న రైతులను ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు మద్యం దుకాణాలకు లాటరీ
దరఖాస్తుల్లో రాష్ట్రంలో మూడోస్థానంలో ఏలూరు జిల్లా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నూతన మద్యం షాపుల కేటాయింపుకు దరఖాస్తుల ప్రక్రియ శుక్రవారం ముగియడంతో ఈ నెల 14వ తేదీ సోమవారం నాడు దుకాణాల కేటాయింపుకు డ్రా ప్రక్రియ నిర్వహించనున్నారు. దరఖాస్తుల విషయంలో 5,825 దరఖాస్తులతో ఎన్‌టిఆర్ జిల్లా మొదటి స్థానంలో ఉండగా, 5,627 దరఖాస్తులతో పశ్చిమగోదావరి రెండో స్థానంలోనూ, 5496 దరఖాస్తులతో ఏలూరు జిల్లా మూడో స్థానంలోనూ ఉన్నాయి. ఏలూరు జిల్లాకు మొత్తం 144 మద్యం దుకాణాలకు ఈ నెల ఒకటో తేదీన నోటిఫికేషన్ ఇవ్వగా 11వ తేదీ శుక్రవారం దరఖాస్తుల ప్రక్రియ సమయం ముగిసే నాటికి 5,496 దరఖాస్తులు వచ్చాయి. అంటే సరాసరి ఒక్కో దుకాణానికి 38 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో మొత్తం ఏడు ఎక్సైజ్ సర్కిల్స్ ఉండగా ఏలూరు సర్కిల్ పరిధిలో 782, చింతలపూడి సర్కిల్ పరిధిలో 784, భీమడోలు సర్కిల్ పరిధిలో 1,107, జంగారెడ్డిగూడెం సర్కిల్ పరిధిలో 960, పోలవరం సర్కిల్ పరిధిలో 599, నూజివీడు సర్కిల్ పరిధిలో 676, కైకలూరు సర్కిల్ పరిధిలో 488 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా భీమడోలు సర్కిల్ పరిధిలో 1,107 దరఖాస్తులు రాగా అత్యల్పంగా కైకలూరు సర్కిల్ పరిధిలో 588 దరఖాస్తులు వచ్చాయి. ఇక మండలాలవారీగా చూస్తే భీమడోలు మండలంలో ఏడు దుకాణాలకు 386 దరఖాస్తులు వస్తే, రెండో స్థానంలో ఉన్న జంగారెడ్డిగూడెం మున్సిపాల్టీలో ఏడు దుకాణాలకు 357 దరఖాస్తులు వచ్చాయి. అంటే భీమడోలులో ఒక్కో దుకాణానికి సరాసరి 55 దరఖాస్తులు, జంగారెడ్డిగూడెంలో ఒక్కో దుకాణానికి సరాసరి 51 దరఖాస్తులు వచ్చాయి. ఇక 21 దుకాణాలు ఉన్న ఏలూరు కార్పొరేషన్‌లో 402 దరఖాస్తులు వచ్చాయి. అంటే ఇక్కడ సరాసరి ఒక్కో దుకాణానికి 19 దరఖాస్తులు వచ్చాయి. ఇక అత్యల్పంగా కుక్కునూరు మండలంలో ఒక దుకాణానికి 74 దరఖాస్తులు, వేలేరుపాడు మండలంలో ఒక దుకాణానికి 74 దరఖాస్తులు వచ్చాయి. ఇక అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా చూస్తే ఏలూరు నియోజకవర్గంలో 26 దుకాణాలకు 490 దరఖాస్తులు, దెందులూరు నియోజకవర్గంలో 15 దుకాణాలకు 292 దరఖాస్తులు, చింతలపూడి నియోజకవర్గంలో 24 దుకాణాలకు 1,204 దరఖాస్తులు, పోలవరం నియోజకవర్గంలో 25 దుకాణాలకు 1,139 దరఖాస్తులు, ఉంగుటూరు నియోజకవర్గంలో 17 దుకాణాలకు 822 దరఖాస్తులు, నూజివీడు నియోజకవర్గంలో 16 దుకాణాలకు 676 దరఖాస్తులు, కైకలూరు నియోజకవర్గంలో 21 దుకాణాలకు 588 దరఖాస్తులు, గోపాలపురం నియోజకవర్గంలో ఐదు దుకాణాలకు 285 దరఖాస్తులు వచ్చాయి.

ఏలూరు జిల్లాలోని 144 మద్యం దుకాణాలకు స్థానిక మినీ బైపాస్‌లోని చలసాని గార్డెన్స్‌లో సోమవారం డ్రా ప్రక్రియ నిర్వహించనున్నారు. డ్రా ప్రక్రియ ఉదయం 8 గంటలకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రారంభమవుతుందని, దరఖాస్తుదారులు ఏడు గంటలకు అక్కడికి చేరుకోవాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎ.ఆవులయ్య తెలిపారు. దరఖాస్తుదారులు ఎంట్రీపాస్‌తోపాటు ఐడి ప్రూఫ్‌గా ఓటర్ ఐడి కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పాన్ కార్డుల్లో ఏదోకటి వెంట తెచ్చుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు తమకు బదులుగా వేరొక ప్రతినిధిని పంపేటట్లయితే ఆ ప్రతినిధి అతని ఆధార్ కార్డుతోపాటు దరఖాస్తుదారుని ఆధార్ కార్డు, సెల్ఫ్ డిక్లరేషన్ పత్రం తీసుకురావాలని తెలిపారు. డ్రా ద్వారా దుకాణం కేటాయించబడిన అభ్యర్థులకు అదే రోజు లైసెన్స్ ఇస్తామని, మొత్తం సొమ్ములో ఆరో వంతు వెంటనే చెల్లించి లైసెన్స్ పొందాల్సి ఉంటుందని తెలిపారు.

నేడు వాహనాల దారి మళ్లింపు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మద్యం దుకాణాలకు సోమవారం లాటరీ నిర్వహిస్తున్న నేపథ్యంలో నగరంలోకి ప్రవేశించే వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఏలూరు మినీ బైపాస్ రోడ్డులో చలసాని గార్డెన్స్‌లో అబ్కారీ శాఖ ఆధ్వర్యాన మద్యం దుకాణాల కేటాయింపు సోమవారం చేపట్టనున్న సంగతి తెలిసిందే. ఏలూరు వంగాయగూడెం ప్రాంతం నుండి కొత్త బస్టాండ్ వైపు వచ్చే వాహనాలు పడమరలాకులు, రైల్వే వంతెన కింద నుండి ప్రధాన రహదారికి చేరుకుంటాయని ఆయన తెలిపారు. గ్రీన్ సిటీకి చేరుకునే వాహనాలు సత్రంపాడు నేరెళ్ల హోండా పక్కగా ఉన్న రైల్వే వంతెన కింద నుండి గ్రీన్ సిటీకి చేరుకుంటాయని తెలిపారు. ఒకటో పట్టణ ప్రాంతం నుండి గ్రీన్ సిటీకి చేరుకునే వాహనాలు వంగాయగూడెం వంతెన మీదుగా మళ్లించామని తెలిపారు. నగరంలోకి చేరుకునే ప్రజలు దారి మళ్లింపులను గుర్తించి పోలీసు శాఖకు సహకరించాలని డిఎస్‌పి శ్రావణ్ కుమార్ కోరారు. ఈ దారి మళ్లింపు మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ ముగిసే వరకూ కొనసాగుతుందని తెలిపారు.

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తిని గెలిపించాలి

- గోపీమూర్తి పరిచయ సభలో వక్తల పిలుపు
- సమాజం పట్ల బాధ్యత కలిగిన వ్యక్తి గోపీమూర్తి
- పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు
- అందరి పక్షాన పిడిఎఫ్ పోరాటం
- ఎంఎల్‌సి ఐవి

ప్రజాశక్తి - భీమవరం

అభివాదం చేస్తున్న ఎంఎల్‌సిలు, యుటిఎఫ్ నేతలు

ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొర్రా గోపీమూర్తిని గెలిపించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శాసనమండలిలో ప్రాతినిధ్యం వహించడమే కాకుండా సమస్యల పరిష్కారానికి ప్రజల గొంతు వినిపించాలంటే గోపీమూర్తిని గెలిపించుకోవాల్సిన అవసరం, ఆవశ్యకత నేడు ఎంతో ఉందన్నారు. స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవనంలో పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి పరిచయ కార్యక్రమ సభ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నక్కా వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్.ప్రసాద్ గోపీమూర్తి అభ్యర్థిత్వాన్ని బలపరిచి మద్దతు తెలిపారు. శాసనమండలిలో పిడిఎఫ్ ఫ్లోర్‌లీడర్, ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు గోపీమూర్తి అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించగా, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్.లక్ష్మణరావు బలపర్చారు. ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా ప్రస్తుత యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బొర్రా గోపీమూర్తి పోటీ చేయనున్నట్లు కెఎస్.లక్ష్మణరావు ప్రకటించారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, బుద్ధుని విగ్రహానికి ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు, రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎంఎల్‌సి షేక్ సాబ్జీ చిత్రపటానికి యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నక్కా వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్.ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) శాసనమండలిలో ప్రజాపక్షంగా పని చేస్తుందన్నారు. సామాన్యులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, చిరుద్యోగుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి ప్రభుత్వంతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. అవసరమైన సందర్భాల్లో బాధితులతో కలిసి పోరాడుతుందని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ ఉద్యమ నేతగా ఉన్న గోపీమూర్తిని గెలిపించాలని పిలుపునిచ్చారు. పిడిఎఫ్ ఫ్లోర్‌లీడర్, ఎంఎల్‌సి లక్ష్మణరావు మాట్లాడుతూ 2007 నుండి ఇప్పటి వరకు జరిగిన శాసనమండలి ఎన్నికల్లో నీతి నిజాయతీలతో సమాజం పట్ల బాధ్యత కలిగిన వ్యక్తులను అభ్యర్థులుగా నిలిపి ఘనమైన విజయాలు సొంతం చేసుకున్న చరిత్ర పిడిఎఫ్‌కు ఉందని గుర్తు చేశారు. రానున్న కాలంలోనూ పిడిఎఫ్ ఆ రకమైన ఒరవడిని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే గోపీమూర్తిని అభ్యర్థిగా ప్రకటించామని, ఆయన గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ప్రసాద్ మాట్లాడుతూ సమాజం పట్ల బాధ్యత, సమస్యల పట్ల అవగాహన కలిగిన వ్యక్తి గోపీమూర్తి అన్నారు. అటువంటి వ్యక్తిని శాసనమండలికి పంపించాలని కోరారు. ప్రజా గొంతు వినిపించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ శాసనమండలి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుని గోపీమూర్తిని గెలిపించాలని కోరారు. ఎంఎల్‌సి అభ్యర్థి బి.గోపీమూర్తి మాట్లాడుతూ ఎంఎల్‌సిగా పోటీ చేసేందుకు అవకాశం దక్కడం తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలతోపాటు సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరూ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం, ఏలూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తాఫాఆలీ, ఆర్.రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దండు పద్మావతి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు బిఎల్‌జె.గాంధీ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు, ఎస్‌ఎఫ్ఐ నాయకులు పి.వాసు, జనవిజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి మల్లుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఐవి, పిడిఎఫ్ అభ్యర్థి గోపీమూర్తి

పశువుల డాక్టర్‌ను నియమించండి
అధికారులకు మంత్రి పార్థసారధి ఆదేశం

ప్రజాశక్తి - నూజివీడుటౌన్

పశుసంవర్థక శాఖ జెడితో మాట్లాడుతున్న మంత్రి

పాడి పశువుల ఆరోగ్య పరిరక్షణకు నూజివీడు పశువుల ఆసుపత్రిలో డాక్టర్‌ను నియమించాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్‌ను ఆదేశించారు. నూజివీడు మండలం పల్లెర్లమూడిలో ఆదివారం సాయంత్రం మంత్రి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తమ మండలంలో పశు సంపద ఎక్కువగా ఉందని, లంపీ స్కిన్ ఎలర్జీ వచ్చి ఆవులు చనిపోతున్నాయని, మేకలు, గొర్రెలు, ఆవులకు ఒకే రకమైన మోతాదులో ఇంజక్షన్ ఇస్తున్నారని తెలిపారు. దాన్ని మార్చి పశువులకు అవసరమైన నాణ్యమైన మందులు ఇచ్చి మెరుగైన వైద్యం అందించాలన్నారు. తమ మండలంలో పశువుల ఆసుపత్రిలో డాక్టర్ లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల సమస్యపై మంత్రి పార్థసారధి వెంటనే స్పందిస్తూ నూజివీడు మండలంలో పశువుల ఆసుపత్రిలో డాక్టర్‌ను నియమించాలని పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్‌ను సెల్‌ఫోన్ ద్వారా మంత్రి ఆదేశించారు. రైతుభరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్, సచివాలయాలు సగంలో నిలిచిపోయాయని, వెంటనే పూర్తి చేయాలని గ్రామస్తులు కోరగా తక్షణమే పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కొల్లి పద్మ తమ తల్లి కేన్సర్‌తో బాధ పడుతుందని మంత్రి దృష్టికి తీసుకురాగా వెంటనే రూ.10 వేలు ఆర్థిక సాయం మంత్రి అందజేశారు. మంత్రి వెంట గ్రామ ప్రముఖులు రాజా, ఎ.రమేష్, రాజేష్ పాల్గొన్నారు.

నా మాటే శాసనం..!

- ఎంపిడిఒ కార్యాలయంలో ఓ అధికారి తీరు
- ఉద్యోగులకు తప్పని చింత
- ఇష్టారాజ్యంగా బిల్లులు?

ప్రజాశక్తి - ఏలూరు

ఆ ఎంపిడిఒ కార్యాలయంలో ఆ అధికారి చెప్పిందే శాసనం. కింది స్థాయి ఉద్యోగుల నుంచి, ఉన్నతాధికారి వరకు ఆ అధికారి మాట వినాల్సిందే. నియంతృత్వ పోకడలతో ఇష్టానుసారంగా బిల్లులు పెట్టుకుంటూ తాను చెప్పిందే శాసనమంటూ మిగిలిన ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు ఆ అధికారి. దీంతో ఆ కార్యాలయంలో ఉద్యోగం చేసేందుకు ఎవరూ ముందుకు రాని పరిస్థితి.

ఏలూరు జిల్లాలో ఒక మెట్ట ప్రాంతం మండల కేంద్రం, ఆపై నియోజకవర్గ కేంద్రంలో ఉన్న ఎంపిడిఒ కార్యాలయంలో పని చేస్తున్న ఓ అధికారి నియంతృత్వ పోకడలకు ఎంపిడిఒతోపాటు కిందిస్థాయి ఉద్యోగులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండేళ్లుగా ఆ ఎంపిడిఒ కార్యాలయంలో పని చేయడానికి, ఎంపిడిఒలు సైతం చేతులెత్తేస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. గతంలో సదరు అధికారి పక్కనే ఉన్న మండలంలో పని చేసినప్పుడు భారీగా అవినీతికి పాల్పడినట్లు అనేక ఆరోపణలు ఉన్నాయి. ఆ అధికారి బదిలీపై పక్కనే ఉన్న నియోజకవర్గ కేంద్రంలో ఉన్న ఎంపిడిఒ కార్యాలయానికి వచ్చారు. ఆ అధికారి ఏదైనా కార్యక్రమం చేస్తే బిల్లులు వెంటనే పెట్టుకుంటున్నారని, ఎంపిడిఒకాని, సిబ్బందిగాని ఖర్చు పెడితే బిల్లులు పెడతాలే అని చెబుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఎప్పుడు చూసినా మండల బడ్జెట్ లేదని, సిబ్బందికి జీతాలు కూడా ఆలస్యంగా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల సమావేశంగాని ఇతర కార్యక్రమాలుగానీ ఆ అధికారి ఎంపిడిఒను సైతం లెక్క చేయకుండా బిల్లులు ఇష్టానుసారంగా పెట్టుకుంటున్నారని పలువురు చెబుతున్నారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపిడిఒలను ఇబ్బంది పెడుతూ పంపించేసి ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా పని చేయాలనే ఆకాంక్షతో ఇక్కడకు బదిలీపై వస్తున్న ముగ్గురు ఎంపిడిఒలను రాకుండా అడ్డుకున్నట్లు సమాచారం. ప్రస్తుతమున్న ఎంపిడిఒను ఇక్కడ నుంచి పంపించాలని శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. 2022 నుంచి ఇప్పటి వరకు మండల పరిషత్ బడ్జెట్ ఖర్చులు, లావాదేవీలను ఉన్నతాధికారులు ఒక్కసారి పరిశీలిస్తే మొత్తం గుట్టురట్టయ్యే అవకాశం ఉందని ప్రజాసంఘాల నాయకులు ఘంటాపథంగా చెబుతున్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో ప్రొజెక్టర్ ఉండగా బయట నుంచి తీసుకొచ్చి రోజుకు సుమారు రూ.ఐదు వేలు అద్దె రూపంలో బిల్లు పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎంపిడిఒ కార్యాలయంలో ప్రొజెక్టర్ ఉండగా, బయటి నుంచి తీసుకురావడం ఏమిటో, దానికి రూ.5 వేలు బిల్లు పెట్టడం ఏమిటో అర్థం కాని పరిస్థితి. ఆడుదాం ఆంధ్రా ఖర్చులు కూడా లెక్కకు మించి పెట్టారని, పోటీలో పాల్గొన్న క్రీడాకారులకు ఇప్పటికీ డబ్బు ఇవ్వలేదని చెబుతున్నారు. ఈ మధ్య జరిగిన రెండు రోజుల శిక్షణ సమావేశానికి 30 మంది హాజరైతే సుమారు రూ.79 వేలు బిల్లు పెట్టినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. అదే ఎంపిడిఒ కార్యాలయం వద్ద గతంలో సుమారు రెండేళ్లుగా వాచ్‌మెన్ పని చేస్తున్న ఆయనకు నెలకు రూ.ఏడు వేల జీతం ఇచ్చేవారు. ఆ అధికారి రావడంతోనే జీతం అంత ఇవ్వటం కుదరదని, రూ.ఐదు వేలు ఇస్తామని, ఇష్టముంటే పని చేయాలని, లేకపోతే మానేయాలని హుకుం జారీ చేయటంతో కుటుంబ పోషణకు జీతం సరిపోక ఆ వాచ్‌మెన్ మానేసినట్లు తెలుస్తుంది. రూ.6 వేలు ఇచ్చి వేరే వాచ్‌మెన్‌ను పెట్టినా అతను జీతం సరిపోక వెళ్లిపోయాడని చెబుతున్నారు. ఇప్పుడు కనీసం వాచ్‌మెన్ లేని పరిస్థితి.

ఎంపిపికీ తెలియకుండా బిల్లులు

ఎంపిపికి తెలియకుండా బిల్లులు పెట్టుకున్నారని, నోట్ పే లేకుండా బిల్లులు పెట్టుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఎంపిపి, ఎంపిడిఒకు సంబంధం లేకుండా బిల్లులు పెట్టుకుంటున్నారని, గట్టిగా ప్రశ్నిస్తే తప్పుడు ఫిర్యాదులు చేస్తారనే ఇబ్బందితో, ఆగడాలు తట్టుకోలేక జిల్లా అధికారికి కూడా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇప్పటి వరకు నోట్ పే లేకుండా బిల్లులు పెట్టుకుంటున్నారని పలువురు చెబుతున్నారు. ప్రస్తుతమున్న ఎంపిడిఒ కూడా ఇక్కడ ఉండలేక బయటకు వెళ్లిపోవాలని చూస్తున్నారని, బదిలీపై రావాలనుకుంటున్న ఎంపిడిఒను రాకుండా అడ్డుకుంటున్నారని తెలుస్తుంది. మండలాభివృద్ధి జరగాలంటే అధికారి ఆగడాలు ఉన్నతాధికారులు అరికట్టి ఎంపిడిఒ, కిందిస్థాయి ఉద్యోగుల ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు. ఆ కార్యాలయ ఉద్యోగులు తమకీచింత ఎప్పుడు తీరుతుందా అని ఎదురుచూస్తున్నారు.

సకల సదుపాయాలతో ప్రభుత్వ వైద్య కళాశాల హాస్టల్
ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పనులను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ చంటి

ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల హాస్టల్ నిర్మాణాన్ని సకల సదుపాయాలతో దశలవారీగా పూర్తిచేసి ఉమ్మడి జిల్లాకే గర్వకారణంగా నిలుపుతామని ఎంఎల్‌ఎ బడేటి చంటి తెలిపారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా అవసరమైన స్థల సేకరణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజల దశాబ్దాల కల అని, వైద్య కళాశాల ప్రారంభమైనప్పటికీ హాస్టల్ నిర్మాణాలు మాత్రం ఇంకా కొనసాగుతున్నాయని తెలిపారు. ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో చేపట్టిన ఈ నిర్మాణాల్లో కొన్ని తుది దశకు చేరుకున్నాయని, మొదటి, ద్వితీయ సంవత్సరాల మెడికల్ విద్యార్థులకు వీటిని కేటాయించేందుకు చర్యలు చేపట్టారని చెప్పారు. ఇప్పటికే పూర్తయిన హాస్టల్స్ రూముల్లో ముగ్గురు చొప్పున 120 మంది పురుషులకు, 180 మంది మహిళలకు బెడ్స్‌ను కేటాయించనున్నారన్నారు. ఈ సందర్భంగా హాస్టల్ భవంతులను ఎంఎల్‌ఎ చంటి ఆదివారం పరిశీలించారు. మ్యాప్ సహాయంతో నిర్మాణాల తీరును ఎంఎల్‌ఎకు అధికారులు వివరించారు. తొలుత హాస్టల్ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఎన్నోఏళ్ల కలను పూర్తిస్థాయిలో సాకారం చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. దీనికి అవసరమైన ఎకరంన్నర స్థల కేటాయింపు విషయంలో జిల్లా కలెక్టర్‌తోపాటు వైద్య ఆరోగ్య శాఖామంత్రికి ప్రతిపాదనలు పంపుతామని స్పష్టం చేశారు. 2026 నాటికి ప్రభుత్వ వైద్యకళాశాల హాస్టల్ నిర్మాణాలను పూర్తి చేసి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకే గర్వకారణంగా నిలుపుతామన్నారు. మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ శశిధర్ మాట్లాడుతూ అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చిన ఎంఎల్‌ఎ చంటికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వజన ఆసుపత్రి డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లికార్జునరావు, ఇఇ రాజబాబు, మెగా కనస్ట్రక్షన్స్ ప్రతినిధులు, టిడిపి నాయకులు చల్లా వెంకట సత్యవరప్రసాదరావు, బెల్లపుకొండ కిషోర్, ఆర్నేపల్లి తిరుపతి, అమరావతి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'మీకోసం' రేపటికి వాయిదా

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 14న సోమవారం నాడు నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమాన్ని 15వ తేదీ మంగళవారం నిర్వహించనున్నట్లు డిఆర్ఒ పుష్పమణి ఒక ప్రకటనలో తెలిపారు. నూతన మద్యం పాలసీలో భాగంగా ఈ నెల 14న మద్యం దుకాణాల కేటాయింపు ఉన్నందున ప్రజాఫిర్యాదుల స్వీకరణ ఆ రోజు చేపట్టడం లేదని, మంగళవారం ఉదయం 10 గంటల నుంచి చేపడతామని తెలిపారు.

రూ.పది వేలు ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - చింతలపూడి

చదుకునే వారికి జనసేన పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ చింతలపూడి మండల అధ్యక్షులు చిదరాల మధుబాబు అన్నారు. చింతలపూడి మండలం రాఘవాపురం పంచాయతీ పసుపులేటి పుల్లారావు పిల్లల చదువు నిమిత్తం మధుబాబు ఆధ్వర్యాన రూ.పది వేలు ఆర్థిక సాయం అందించారు. భవిష్యత్‌లో ఆ కుటుంబానికి మరింత అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన మండల ఉపాధ్యక్షులు కొత్తపల్లి సాయిబాబు, పోతునూరు వి.వెంకటేశ్వరరావు, మల్లేశ్వరం ఎం.రాజకుమార్, రాఘవాపురం గ్రామ అధ్యక్షులు వెంకటేశ్వరరావు మండల కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక కోటకలిదిండిలోని పురవీధుల్లో దుర్గామాత ఊరేగింపు సందర్భంగా ప్రదర్శించిన కళారూపాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. కాంతార వేషధారణ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 50 మందికి పైగా పాల్గొన్న కళాకారులు తమ కళా నైపుణ్యంతో చూపరులను మెప్పించారు. కళాకారులు ప్రేమ్ కుమార్, అశోక్, ప్రసాద్, బాపూజీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిన్నంపేట చెరువు నుండి అనుమతుల్లేకుండా గ్రావెల్ తోలకాలు

ట్రాక్టర్లను సీజ్ చేసిన తహాశీల్దార్

ప్రజాశక్తి - చాట్రాయి

చాట్రాయి మండలం చిన్నంపేట నుంచి కోటపాడు వెళ్లే మార్గంలో చిన్నంపేట చెరువు నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నట్లు ట్రాక్టర్లు, పొక్లెయిన్ సీజ్ చేసినట్లు తహాశీల్దార్ డి.ప్రశాంతి తెలిపారు. నాలుగు ట్రాక్టర్లు, రెండు పొక్లెయిన్లు చాట్రాయి పోలీసులకు అప్పగించామన్నారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనం పట్టివేత

నేరాలు - ఘోరాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకులగూడెం సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద ఆదివారం సాయంత్రం కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. వాహన తనిఖీలు చేస్తుండగా తెలంగాణ రాష్ట్రం నుంచి ఐషర్ వాహనంలో నిడమర్రు మండలానికి అక్రమంగా కోళ్ల వ్యర్థాలను తరలిస్తుండగా పట్టుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ కె.నాగేశ్వరరావు తెలిపారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు..

వివాహితను వేధిస్తున్న ఇద్దరిపై కేసు

ప్రజాశక్తి - ముసునూరు

వివాహితను అసభ్యకర పదజాలంతో వేధిస్తున్న ఇద్దరు వ్యక్తులపై ముసునూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన వివాహితను జంధ్యాల రాంబాబు, నాగరాజు నిత్యం ఫోన్ చేసి వేధిస్తూ, అసభ్యకరంగా మాట్లాడుతున్నారని బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఊకలారీని ఢీకొట్టిన బొలెరో వ్యాన్

భవాని మాలధారులు క్షేమం - వ్యాన్ డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు జాతీయ రహదారిపై సత్యనారాయణపురం వంతెన వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. సత్యనారాయణపురం వంతెన వద్ద ఒక లారీని వెనుక నుంచి వస్తున్న బొలెరో వ్యాన్ ఢీకొట్టింది. బొలెరో వ్యాన్‌లో భవాని మాలధారులు క్షేమంగా ఉన్నారు. వ్యాన్ డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో హైవే పోలీసులు ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతానికి యువకుడు మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పండుగ నాడు ఆ ఇంట విషాదం నెలకొంది. తమ వాహనాన్ని నీటితో శుభ్రం చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైన యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం జగన్నాధపురం ప్రాంతానికి చెందిన మాత్రపు వెంకటేశ్వరరావు (23) కూలి పనులు చేస్తుంటాడు. ఇతనికి ఇంకా వివాహం కాలేదు. పండుగను పురస్కరించుకుని తాను పనిచేసే జెసిబిని నీటితో ఆదివారం శుభ్రం చేస్తున్నాడు. అదే సమయంలో నీటిని శుభ్రం చేసేందుకు వినియోగిస్తున్న మోటర్ నుండి విద్యుత్ ప్రవహించి ఒకసారిగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో ఘటనా స్థలంలోనే వెంకటేశ్వరరావు మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు.

కందిపప్పు.. అందేదెప్పుడు..!

ప్రజాశక్తి - చింతలపూడి



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కందిపప్పు పంపిణీ మండలంలో నేటికీ అందని పరిస్థితి. రేషన్ బియ్యంతో పాటుగా పంచదార, కందిపప్పు పంపిణీ చేయని పరిస్థితి. అంగన్వాడీ సెంటర్‌కి వెళ్లాల్సిన సరుకులు ఆలస్యంగా పంపిణీ జరుగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపమా, లేక నిర్లక్ష్యమా అర్థం కాని పరిస్థితి. ప్రతి నెలా ఒకటో తేదీన రేషన్ కార్డుదారులకు, ఐసిడిఎస్ వారికి రేషన్ బియ్యంతో పాటు, పంచదార, కందిపప్పు అందటం లేదు. ఎండియుఎస్ బియ్యం పంపిణీ చేసిన తరువాత పంచదార రావటంతో కొంత పంపిణీ చేసి వదిలేస్తున్నారు. అంగన్వాడీ కేంద్రాలకు రేషన్ కూడా సమయానికి అందకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు.

చింతలపూడి, లింగపాలెం మండలాల్లో మొత్తం 82 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 48,218 రేషన్ కార్డులు ఉన్నాయి. 281 అంగన్వాడీ సెంటర్లు ఉన్నాయి. ప్రతి నెలా పదో తేదీ లోపు రేషన్ కార్డుదారులకు, అంగన్వాడీ సెంటర్‌కి రేషన్ పంపిణీ జరగాలి. కాని పదో తేదీ లోపు బియ్యం ఒక్కటే పంపిణీ జరుగుతుంది. పంచదార, కందిపప్పు ఇప్పటికీ పంపిణీ జరగని పరిస్థితి. బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు రాకపోవటంతో అవి అందక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 11వ తేదీ వరకు అంగన్వాడీ సెంటర్లకు ఇంకా రేషన్ పంపిణీ జరగని పరిస్థితి నెలకొంది. 8, 9,10వ తేదీల్లో వారికి పంపిణీ జరిగింది. పండుగ సమయం కావడంతో సరిపోయిందని, ప్రతి నెలా పదో తేదీన రేషన్ పంపిణీ చేస్తే ఒకటో తేదీ నుంచి పదో తేదీ వరకు అంగన్వాడీ పిల్లల పరిస్థితి ఏంటి అనే ప్రశ్న. అక్కడ ఇక్కడ తెచ్చి సర్దుకుంటూన్నామని ఐసిడిఎస్ అధికారులు చెబుతున్నారు. చింతలపూడి మండలంలో 90 సెంటర్లు ఉండగా 30 సెంటర్‌లలో మాత్రమే పంపిణీ జరిగింది. ఇలా ప్రాజెక్టు పరిధిలో 281 సెంటర్లు ఉన్నాయి. సుమారుగా 150 సెంటంల్‌లో పంపిణీ జరిగినట్లు చెబుతున్నారు. మరి మిగతా 131 సెంటర్‌లలో ఎప్పుడు పంపిణీ చేస్తారో తెలియని పరిస్థితి. చింతలపూడి, లింగపాలెం మండల్లాలో ఉన్న రేషన్ కార్డుదారులకు ఈ నెల ఎండియుఎస్ ద్వారా పంపిణీ చేయాల్సిన కందిపప్పు, పంచదార ఇప్పటివరకు పూర్తి స్థాయిలో పంపిణీ అవ్వలేదు. మండలాల్లోని డీలర్స్, ఎండియుఎస్ వారిని ఫోన్ ద్వారా కార్డుదారులు సంప్రదిస్తే వారికి వచ్చినంత వరకు మాత్రం కార్డుదారులకు పంపిణీ చేశామని తెలిపారు. ప్రతి నెలా ఎండియుఎస్ ఒక షాపు డిస్ట్రిబ్యూషన్ అయ్యాక అప్పుడు కందిపప్పు, పంచదార వచ్చింది తీసుకొని డిస్ట్రిబ్యూషన్ చేయమని ఎంఎల్ఎస్ పాయింట్ వారు డీలర్స్‌కి తెలియజేస్తున్నారు. ఒక షాపు పూర్తయ్యాక మళ్లీ కందిపప్పు కోసం వెళ్లటానికి ఎండియు నిరకరిస్తున్నాట్లు తెలుస్తుంది. స్కూల్స్, ఐసిడిఎస్‌కు ఇవ్వాల్సిన కందిపప్పు సకాలంలో ఎప్పుడే రాలేదని వారు చెబుతున్నారు. ప్రతి నెలా ఎంఎల్ఎస్ పాయింట్ ధర్మాజీగూడెం వారు బియ్యం, కందిపప్పు, పంచదార మిగతా సరుకులు కార్డుదారులకు, స్కూల్స్, ఐసిడిఎస్‌కి అందిస్తే ఎండియు వారు ఆ సరుకులు ఏకకాలంలో పంపిణీ చేయగలుగుతారు. డీలర్స్ థంబ్ వేయడానికి మూడు సార్లు ఎంఎల్ఎస్ పాయింట్‌కి వెళ్లాల్సి వస్తుంది. దీంతో కొన్ని చోట్ల జాప్యం జరుగుతుంది.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం..

సివిల్ సప్లై డిఎం శ్రీలక్ష్మి

కందిపప్పు సరఫరా ఆలస్యమైంది. పంచదార, బియ్యం సరైన సమయానికి అందిస్తున్నాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా సరైన చర్యలు తీసుకుంటాం.

మద్దిపోటి నాగేశ్వరరావుకు పరామర్శ

ప్రజాశక్తి - కామవరపుకోట

కారు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద చికిత్స తీసుకుంటున్న రామన్నపాలేనికి చెందిన టిడిపి నేత మద్దిపోటి నాగేశ్వరరావును విజయవాడలోని లక్ష్మీ ఫౌండేషన్ హాస్పిటల్ ఆపరేషన్ హెడ్ అబ్బూరి సత్యనారాయణ ఆదివారం పరామర్శించారు. తమ ఆసుపత్రిలో సేవా దృక్పథంతో అవసరమున్న పేదలకు అతి తక్కువ ధరకు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలపర్తి రాంబాబు, అబ్బూరి లక్ష్మీనారాయణ, అబ్బూరి శ్రీధర్, వడ్లపూడి విద్యాసాగర్, వడ్లపూడి దుర్గాప్రసాద్, నల్లమోతుల శేషారావు పాల్గొన్నారు

విజయకుమార్ విరమణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ఎంపిడిఒగా పని చేసిన వేమూరి ఏంజిల్ విజయకుమార్ ఉద్యోగ విరమణ సత్కార సభ చినఅవుటుపల్లిలోని ఆదివారం ఘనంగా నిర్వహించారు. నూజివీడు నియోజకవర్గ వ్యాయామ ఉపాధ్యాయులు పి.రవీంద్ర, పి.నాగేశ్వరరావు, రాజేశ్వరి ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించారు. వ్యాయామోపాధ్యాయుడు రవీంద్ర మాట్లాడుతూ ఏంజిల్ సమయపాలన పాటించేవారని, గత సంవత్సరం జరిగిన ఆటల పోటీల్లో క్రీడాకారులకు, వ్యాయామోపాధ్యాయులకు ఎనలేని సేవలు అందించారని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించేవారన్నారు.

16 దుకాణాలకు 673 దరఖాస్తులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడులోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మొత్తం 16 షాపులకుగాను 673 దరఖాస్తులు వచ్చాయని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ మస్తానయ్య తెలిపారు. రూ.13.46 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం వచ్చిందన్నారు. చాట్రాయి మండలంలో రెండు దుకాణాలకుగాను 95, ముసునూరు మండలంలో మూడు దుకాణాలకు 135, ఆగిరిపల్లి మండలంలో నాలుగు దుకాణాలకు 159, నూజివీడు రూరల్ మండలంలో నాలుగు దుకాణాలకు 103, నూజివీడు మున్సిపాలిటీ పరిధిలో మూడు దుకాణాలకు 144 దరఖాస్తులు వచ్చాయని సిఐ వివరించారు.

నేటి నుంచి మూడు రోజులు భారీ వర్షాలు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలి
అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలి
జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

ఈ నెల 14వ తేదీ నుండి 16వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, జిల్లా ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో వర్షాల ప్రభావానికి గురయ్యే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు పట్టణాలు, పల్లెల్లోని కాలువలు, డ్రెయినేజీ మార్గాలను వెంటనే శుభ్రం చేయించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలు వర్షపు నీటి ప్రవాహాన్ని అడ్డుకోకుండా ఉండేందుకు ప్రత్యేక శుభ్రతా కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వ్యవసాయ శాఖాధికారులు రైతులకు తమ పంటలను వర్షాల నుండి ఎలా సంరక్షించుకోవాలో సూచనలు అందించాలన్నారు. పంట నష్టాన్ని తగ్గించుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జల వనరుల శాఖాధికారులు డ్రెయిన్లు, కాలువల్లో నీటి మట్టాలను నిరంతరాయంగా పర్యవేక్షించాలన్నారు. తహాశీల్దార్లు, ఎంపిడిఒలు, జల వనరుల శాఖాధికారులు, జిల్లా అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు జిల్లా అధికారుల సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

ఆందోళన చేస్తున్న దళిత ఐక్య వేదిక నేతలు

రఘురామ కృష్ణంరాజును అరెస్ట్ చేయకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళన

ప్రజాశక్తి - కలిదిండి

ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజును అరెస్ట్ చేయకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపడతామని దళిత ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ గంటా సుందరకుమార్, బహుజన జెఎసి రాష్ట్ర వ్యవస్థాపక కన్వీనర్ తాళ్లూరి మధు అన్నారు. కలిదిండి ప్రధాన సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి దళిత సంఘాల నాయకులు శనివారం పాలాభిషేకం చేసి పూలమాలలు వేశారు. అనంతరం రఘురామకృష్ణంరాజు తీరుపై నిరసన తెలిపారు. నేతలు మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం ఏలూరుపాడులో అంబేద్కర్ ఫ్లెక్సీని ఎంఎల్ఎ ఉద్దేశపూర్వకంగా, దళితులను అవమానించేలా తొలగించడం దారుణమన్నారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని, దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. మాల మహానాడు మండల అధ్యక్షులు బోడిగడ్డ కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బహుజన జెఎసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు కాటం స్టాన్లీ రాజు, జాయింట్ సెక్రటరీ దానం విద్యాసాగర్, జిల్లా సహాయ కార్యదర్శి ఇల్లూరి సంపత్ కుమార్, అంబేద్కర్ ఇండియా మిషన్ (ఎయిమ్) భీమవరం టౌన్ ప్రెసిడెంట్ టి.ప్రశాంత్, ఎస్‌సి నాయకులు తాటి చినబాబు, సిహెచ్.స్మైలీ పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో రమణక్కపేట విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు మండలం రమణక్కపేట విద్యార్థులు బాస్కెట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలోనే ద్వితీయ స్థానం సాధించారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పివిఎస్.రామకృష్ణ అన్నారు. రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల్లో రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలోనే రెండో స్థానం సాధించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా బాస్కెట్ బాల్ ఆటల్లో ప్రతిభ కనబరిచిన టి.నాగసుధ, జి.జెసిడి.ఇందుప్రియ ఈ నెల 10, 11, 12వ తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో పాల్గొన్నారన్నారు. రాష్ట్ర స్థాయిలోనే రెండో స్థానంలో నిలిచిన వారిని, శిక్షణ ఇచ్చిన వాకా నాగరాజును పలువురు అభినందించారు.

నేటి నుంచి పల్లె పండుగ

547 గ్రామ పంచాయతీల్లో వారోత్సవాలు

ప్రజాప్రతినిధులు సమక్షంలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల పనులకు శ్రీకారం

జిల్లావ్యాప్తంగా 1,917 పనులకు రూ.121.57 కోట్లు

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ పంచాయతీల వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని 547 గ్రామ పంచాయతీల్లో 1,917 పనులను రూ.121.57 కోట్ల అంచనాతో ఉపాధి హామీ కింద చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు ఏడు నియోజకవర్గాల్లో స్థానిక ఎంఎల్ఎ ఆధ్వర్యంలో వారోత్సవాల కోసం రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకున్నట్లు ఆమె తెలిపారు.

ఇంజరం సర్పంచి జిగిడి బాలరాజు మృతి

ప్రజాశక్తి - కుక్కునూరు

బాలరాజు (ఫైల్‌ఫొటో)

మండలంలోని ఇంజరం గ్రామానికి చెందిన జిగిడి బాలరాజు (45) తెలంగాణ రాష్ట్రంలోని కుడుములుపాడు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అత్తవారింకిటికి వెళ్లొస్తుండగా ఎదురుగా కుక్క అడ్డు రావడంతో దానిని తప్పించే క్రమంలో అదుపుతప్పి బైక్ పైనుంచి పడిపోయినట్లు, తీవ్ర గాయాలతో బాలరాజు మృతి చెందినట్లు తెలిపారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కూటమి ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా సూపర్ సిక్స్ హామీలు వెంటనే అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మొడియం నాగమణి అన్నారు. స్థానిక సిపిఎం బజార్ జట్టు శాఖ మహాసభ సాదుబోయిన శివకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు చెరుకూరి మర్రిడియ్య జెండావిష్కరణ చేశారు. మండల కన్వీనర్ శుక్లబోయిన రాంబాబు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. సాదుబోయిన శివకుమార్‌ను నూతన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. అశోకనగర్, పాత ఆంధ్రాబ్యాంకు, చింతలమ్మ గుడి రోడ్డులో చెత్త వేస్తున్న వారిపై పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో త్రిమూర్తులు, పిల్ల తంమారావు, యు.గోపి, మర్రి సుబ్రమణ్యం, యు.వెంకన్న పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు
O.S.No. 153/2013
బిట్వీన్:
మట్ట మధుసూధన రావు ...*Plaintieff*
AND
వెలగల వెంకట రమణ రావు & 29 Others ...*Defendants*
28వ డిఫెండెంట్:
గుమ్మడి స్వరాజ్య లక్ష్మి, భర్త: లేటు రామకృష్ణ రావు, ఫిమేల్, వయస్సు 65 సం॥లు, R/o.విజయరాజు విలేజ్, పెద్దవేగి మండలం, ఏలూరు జిల్లా - ప॥గో॥జిల్లా.
పై నెంబరు గ్రంధంలో మీరు 28వ డిఫెండెంట్ అయి ఉన్నారు. మేము ఎన్నిసార్లు కోర్టు ద్వారా మీకు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. అందువలన శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం పత్రికాముఖంగా తెలియజేయునది ఏమనగా **ది.29-10-2024వ తేదీన పై నెంబరు గ్రంధంలో శ్రీ కోర్టు వారి ఎదుట మీయొక్క హాజరు నిమిత్తం వాయిదా అయి ఉన్నది.** కావున ఆరోజు ఉదయం గం॥10:30 ని॥లకు స్వయంగా గాని లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియచేసుకోవలెను. లేని ఎడల సదరు పై నెంబరు గ్రంధము మీయొక్క పరోక్షముగా విచారించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేదీ: ది.29-10-2024
మాగంటి లక్ష్మణ్ కుమార్
కె.వి.ఎస్.సోమయాజి
న్యాయవాదులు, ఏలూరు.
సెల్: 98852 79889

స్థిరాస్థి వేలం ప్రకటన
మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు
ఇ.పి.నెం.78/2016 ఇన్ ఎఎ/సిఎఫ్/నెం.139 ఆఫ్ 2015
బిట్వీన్:
మార్గదర్శి చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, భీమవరం బ్రాంచి, రిప్రజెండెట్ బై ఇట్స్ బ్రాంచి మేనేజర్. ...*డిక్రీ హోల్డర్*
AND
ఆచంట నాగ సత్యశ్రీనివాస ప్రభాకర్ & 6 Others ...*జడ్జిమెంట్ డెబిటార్స్*
1వ జే.డి.ఆర్: ఆచంట నాగ సత్య శ్రీనివాస ప్రభాకర్, తండ్రి: నర్సింహారావు, డో.నెం.17-1-245, అయ్యగారి వారి వీధి, రుస్తుంబాద, నర్సాపురం, పశ్చిమ గోదావరి జిల్లా.
పై నెంబరులో డిక్రీ వసూలు నిమిత్తం 1వ జె.డి.ఆర్. తాలూకు ఈ క్రింది తెలిపిన ఇ.పి.షెడ్యూలు దాఖలా స్థిరాస్థులను (1,2 అయిటమ్స్) **ది.28-10-2024వ తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥10:30 ని॥లకు బహిరంగ వేలం జరుగునని తెలియపరచటమైనది.** కావున వేలం పాటలో పాల్గొనువారు వేలం పాటలో పాల్గొనవచ్చును.
1వ జె.డి.ఆర్.కు చెందిన ప్రోపర్టీ షెడ్యూల్స్ వివరములు
ఐటమ్ నెం.1: పశ్చిమ గోదావరి జిల్లా, నర్సాపురం సబ్-రిజిస్ట్రారు ఆఫీసులో డాక్యుమెంటు నెం.124/2008 నర్సాపురం సబ్ డివిజన్ మున్సిపల్ ఏరియా ఖాళీ స్థలం పాత 23వ వార్డు, క్రొత్త 25వ వార్డు, రుస్తుంబాద రెవెన్యూ విలేజ్ దగ్గరలో పాత డో.నెం.16-3-27, క్రొత్త డో.నెం.16-3-69, సర్వే నెంబరు 617/2ఎ లో గల చ॥గ॥ 316-3కు ఈ క్రింది సరిహద్దులు:
తూర్పు: అ॥48.5 (6అ॥లు) వై.వి.లక్ష్మణరావు, ఉమ్మడి మార్గం. *దక్షిణం:* అ॥58.5 ఎల్లా వెంకట లక్ష్మణరావు గారి స్థలం వగైరాలు. *పడమర:* అ॥48.0 ఎల్లా వెంకట లక్ష్మణరావు గారి స్థలం వగైరాలు. *ఉత్తరం:* అ॥59.5 (13అ॥లు) వెడల్పు ప్రధాన వీధి.
డిక్రీ హోల్డర్ విలువ : రూ.10,00,000/-
మార్కెట్ విలువ : రూ.15,80,000/-
ఐటమ్ నెం.2: పశ్చిమ గోదావరి జిల్లా, నర్సాపురం సబ్-రిజిస్ట్రారు ఆఫీసులో డాక్యుమెంటు నెం.585/2010, నర్సాపురం సబ్ డివిజన్ మున్సిపల్ ఏరియా అయ్యగారి వీధి 27వ వార్డు, రుస్తుంబాద రెవెన్యూ విలేజ్ ఆర్.సి.సి. బిల్డింగ్, డో.నెం.17-1-245/3, సర్వే నెం. 564/18లో గల చ॥గ॥ 159.8కు ఈ క్రింది సరిహద్దులు:
తూర్పు: అ॥26.00 మున్సిపల్ రోడ్. *దక్షిణం:* అ॥49.00 దాసరి వెంక లక్ష్మి గారి స్థలం వగైరాలు. *పడమర:* అ॥26.00 ఉమ్మడి మార్గం ఆకుల శేషయ్య ఇతరులు. *ఉత్తరం:* అ॥61.8 కోడూరి సుబ్బారావు గారి స్థలం.
డిక్రీ హోల్డర్ విలువ : రూ.25,00,000/-
మార్కెట్ విలువ : రూ.7,99,000/-
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
నర్సాపురం, **ఎం.సత్యకృష్ణ**
13-10-24. అడ్వకేట్, నర్సాపురం.

వారెవ్వా.. వంగ

10 అడుగులు పెరిగిన వంగ మొక్క

ప్రజాశక్తి - కామవరపుకోట

వంగ మొక్క

సాధారణంగా వంగ మొక్క పూత, కాపు కాసే సమయానికి రెండు లేదా మూడు అడుగులు పెరిగి కాపు అయిన తర్వాత వాడిపోయి ఎండి పోతుంది. కామవరపుకోట కొత్తూరు మసీదు సమీపంలోని ఉస్సే సంధ్య ఇంటి ఆవరణలోని వంగ మొక్క 10 అడుగులు పైబడి పెరిగింది, ఏ విధమైన ఎరువూ వేయ్యకుండా గత 18 నెలల నుండి గుత్తులుగా కాయలు కాస్తూ పలువురుని అబ్బురపరుస్తుంది. ఎక్కువ ఎత్తు పెరిగి గుత్తులుగా కాయలు కాస్తున్న ఈ మొక్కను స్థానికులు ఆసక్తిగా చూస్తున్నారు.

పాలకొల్లులో భారీ వర్షం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, మబ్బులు, వాన దోబూచులాడుతున్నాయి. పలుసార్లు వర్షం వచ్చి ఏ పనీ సాగకుండా అడ్డుపడుతోంది. దీంతో వివాహ వేడుకలు, శరన్నవరాత్రి ముగింపు ఉత్సవాలు, అన్న సమారాధన, నిమజ్జనాలకు తీవ్ర అంతరాయం కలిగింది. సాయంత్రం ఏకధాటిగా అరగంటపాటు వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

మూషికాల ముప్పేట దాడి

వరి దుబ్బులను ఇష్టానుసారం కొరికేస్తున్న ఎలుకలు
ఒక్కో ఎలుకను పట్టించడానికి రూ.100 ఖర్చు
ఎకరాకు అదనంగా రూ.2 వేలు పెట్టుబడి
వరుస కష్టాలతో రైతుల ఆవేదన

ప్రజాశక్తి - భీమవరం

ఖరీఫ్ సాగుపై మూషికాలు ముప్పేట దాడి చేస్తున్నాయి. వరి పొలాలు కీలక దశలో ఉన్న నేపథ్యంలో ఎలుకల ధాటికి రైతులు విలవిల్లాడుతున్నారు. ఒక ఎలుకను పట్టించాలంటే రూ.100 ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటికే ఎకరాకు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతన్నకు ఎలుకలు పట్టించేందుకు అదనంగా రూ.రెండు వేలు పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరుస కష్టనష్టాలతో విలవిల్లాడుతున్న రైతులను ఎలుకల బెడద వెంటాడుతోంది.

ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఖరీఫ్ సాగులో రైతులు అష్టకష్టాలు పడ్డారు. వరుస వర్షాలు వరదలతో తీవ్ర నష్టాలను చవిచూశారు. అయినా గంపెడాశతో సాగును ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశారే తప్ప వెనకడుగు మాత్రం వేయలేదు. అయితే వరి చేలు కీలక దశలో మారిన నేపథ్యంలో ఎలుకల బెడద రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటికే ఎకరాకు రూ.20 వేల వరకు రైతులు పెట్టుబడి పెట్టి ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎలుకలు పట్టించాలంటే అదనపు పెట్టుబడి తప్పని పరిస్థితి. ఒక్క ఎలుకను పట్టించాలంటే రూ.100 ఖర్చు పెట్టాల్సి వస్తోంది. నెల రోజులుగా ఖరీఫ్ పంటపై మూషికాల దాడి పెరగడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వరి దుబ్బులను ఎక్కడికక్కడే కొరికి పారేస్తున్నాయి. వీటిని కట్టడి చేయడానికి రూ.వేలకు వేలు ఖర్చు పెడుతున్న పరిస్థితి ఉంది. అయితే వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టినప్పటికీ అది ఆలస్యం కావడంతో ఆశించిన మేర ఫలితాలు రాలేదు. జిల్లావ్యాప్తంగా 1150 కేజీల బ్రోమిడియాల్ మందును రైతులకు పంపిణీ చేశారు. అయితే ఈ మందు ఎంతవరకు రైతులు వినియోగించుకున్నారనేది అనుమానమే.

ఎలుకలు పట్టుకునేందుకు బుట్టలు ఏర్పాటు చేస్తున్న వ్యక్తి

జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేపట్టారు. తాడేపల్లిగూడెం వంటి ప్రాంతాల్లో ఖరీఫ్ పంట కోత దశకు చేరింది. భీమవరం, పాలకోడేరు, వీరవాసరం, పెనుమంట్ర మండలాల్లో ముంపునకు గురైన చేలలో ఇటీవలే వరి నాట్లను పూర్తి చేశారు. ఒకచోట కోతకు, మరోచోట దుబ్బు దశలో, అత్యధిక శాతం పంట పొట్ట దశలో ఉంది. ఇప్పటికే ఒకటికి రెండుసార్లు నారుమళ్లు వేసి నష్టపోయిన రైతులు ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలకు మరోమారు వరినాట్లు వేయాల్సి వచ్చింది. అయితే ప్రస్తుతం సుమారు లక్ష ఎకరాలకుపైగా పంట ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. ఈ దశలో వరి దుబ్బులు పొట్టతో ఉండటంతో వరి కర్రలు తీపిని కలిగి ఉంటాయి. ఈ పరిస్థితి ఎలుకలకు ఎంతో అనుకూలంగా, ఇష్టంగా ఉంటుంది. ఈ కారణంగా పొట్ట దశలో మూషికాల దాడి విచక్షణారహితంగా ఉండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులకు మూషికాలను అదుపు చేయడానికి అదనంగా రూ.2 వేలు వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. ముంపు సమస్యతో కొన్ని వరిచేలు కురసగా ఉండటం, మరికొన్ని చేలు ఏపుగా పెరిగి ఎత్తుగా ఉండటం, పొట్ట దశలో ఉండటంతో వీటి దాడి ఏపుగా పెరిగిన వరిచేలపై ఎక్కువగా కన్పిస్తోంది. అయితే వీటిని అదుపు చేయలేని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎలుకలకు అనుకూల వాతావరణం..

పట్టు బడిలో చిక్కిన ఎలుకలు

వరదలు, వర్షాల సమయంలో బహిరంగ ప్రదేశాల్లో కాలువలు, పుంతలు వెంబడి ఉన్న ఎలుకలు ముంపు కారణంగా ఇతర మెరక ప్రాంతాలకు చేరుకుంటాయి. ఆయా ప్రాంతాల్లో తమ ఆహార అవసరాలు తీర్చుకునేందుకు సమీపంలోని వరి చేలపై దాడి చేస్తున్నాయి. ఒక ఎలుక సుమారు రెండు కిలోమీటర్లు వరకు వెళ్లి పంటను పాడు చేసే అవకాశం ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుత వాతావరణం ఎలుకల సంతానోత్పత్తికి అనుకూలంగా ఉండడంతో నెల రోజుల వ్యవధిలోనే వీటి సంతానం పది రెట్లు పెరుగుతుందని ప్రాథమిక అంచనా. ఈ ఏడాది సామూహిక ఎలుకల నిర్వహణా కార్యక్రమం కూడా ఆలస్యం కావడంతో వీటి ఉధృతికి మరో కారణంగా కన్పిస్తుందని రైతులు చెబుతున్నారు.